క్లుప్తంగా

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయండి



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు – రెడ్డివారిపల్లి రహదారిలోని గుంజనేరుపై నిర్మిస్తున్న రెడ్డివారిపల్లి హై లెవల్ బ్రిడ్జిని సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని జిల్లా రోడ్లు, భవనాలశాఖ ఎస్ఈ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. బ్రిడ్జి పనులు 90శాతం పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు. పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సహదేవరెడ్డి, డీఈ జయప్రకాష్, ఏఈ బాషా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న ఆర్.వి. రమణ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట జిల్లా పరిత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశామని జిల్లా రీసోర్స్ పర్సన్ ఆర్.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యత, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించామన్నారు. ఈ తనిఖీలు 10 రోజులు సిద్దవటం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతాయని తుది నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన అన్నారు.

దివ్యాంగుల హక్కులను పరిరక్షించండి

రాయచోటి టౌన్ : దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పోలీసులు సహరించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగిమళ్ల రంగారెడ్డి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను కోరారు. బుధవారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితికి సంబంధించిన పుస్తకాన్ని సీఐ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల రక్షణ కోసం సహకరించాలని కోరారు.

ఉచిత కంటివైద్య శిబిరం

సిద్దవటం : మండలంలోని మాధవరం – 1 గ్రామ పంచాయతీలోని గ్రామ సచివాలయం –2 వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఐకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని కంటి వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 94 మందికి ఉచిత కంటి పరీక్షలు చేసి, వారిలో అవసరమైన వారికి లేజర్ ఆపరేషన్‌లు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. మత్తు సూది లేకుండా లేజర్‌తో శుక్లాల ఆపరేషన్ చేయడం మా ఆస్పత్రి ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నివాళి



కసిరెడ్డి నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి నరసింహారెడ్డి తల్లి శ్రీవాణి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు శ్రీవాణి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పరామర్శ

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని తమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మందపల్లి రమణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అతని స్వగృహానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి బుధవారం రాత్రి వెళ్లి పరామర్శించారు. రమణారెడ్డి ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

సహకార గృహ సంఘం అధ్యక్షుడిగా రాహుల్‌రెడ్డి



రాహుల్‌రెడ్డికి డిక్లరేషన్ పత్రం ఇస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : రాయచోటి (ఎస్.ఎన్. కాలనీ) సహకార గృహ సంఘం అధ్యక్షుడిగా మండిపల్లి రాహుల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం సంఘానికి సంబంధించిన ఎన్నిక జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో సహకార కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అలానే ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు రాహుల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కష్టాలు కనిపించవా అమాత్యా!

- మండిపల్లి సొంత మండలంలో తాగునీటి ఇక్కట్లు
- రెండు నెలలు కావొస్తున్న పట్టించుకోని వైనం
- పొలాల బాట పడుతున్న దిగువగొట్టివీడు అరుంధతివాడ వాసులు



ఒకటిన్నర నెలగా విద్యుత్ కనెక్షన్ లేక నిరుపయోగంగా ఉన్న బోరు



వ్యవసాయ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న అరుంధతివాడ ప్రజలు



వ్యవసాయ బోరు నుండి గ్రామానికి నీళ్లను తెచ్చుకుంటున్న ప్రజలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రజలు చలికాలంలో చిన్నమండెం మండలంలో పలు గ్రామాల్లోని నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని దిగువగొట్టివీడు పంచాయతీ అరుంధతివాడ వాసుల నీటి ఇక్కట్లను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. రాష్ట్ర క్రీడా, యువజన, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సొంత మండలంలోనే నీటి ఇబ్బందులు ఎదుర్కొంటుడడంతో ప్రజలు తమ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. గ్రామంలో నీటి ఇబ్బందులు ఎదురు కాకుండా బోరు సౌకర్యం ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం బోరుకు ఉన్న వైర్లు కాలిపోయాయి. విద్యుత్ కనెక్షన్ అందించేందుకు అవసరమయ్యే వైర్లు లేకపోవడంతో బోరు నిరుపయోగంగా తయారైంది. ఈ విషయమై గ్రామస్తులు అధికారుల చుట్టూ తిరిగి తమ గోడు వెళ్లబోసుకున్నా తమ సమస్య పరిష్కరించడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి కోసం వ్యవసాయ పొలాలకు

గ్రామంలో రెండు నెలల క్రితం బోరు చెడిపోవడంతో ప్రజలు నీటి కోసం కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి గ్రామ పొలాల్లోని వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. తమకు అనారోగ్య పరిస్థితులు ఉన్నా రోజూ పొలాల్లోకి నీటి కోసం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందంటూ గ్రామస్తులు వాపోయారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే ఎండాకాలంలో తమ పరిస్థితి ఎలా ఉండబోతుందో గుర్తు చేసుకుంటూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మా పరిస్థితిని అర్థం చేసుకుని బోరుకు మరమ్మతులు చేపట్టాలని అరుంధతివాడ గ్రామస్తులు కోరుతున్నారు.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ..

రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి మండిపల్లి సొంత మండలం చిన్నమండెంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ నీటి కోసం తిప్పలు తప్పడంలేదు. కాగా లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె మండలాల్లో తాగునీటి కోసం వ్యవసాయ పొలాల వైపు వెళ్లిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అలానే అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతోపాటు శివారు కాలనీల్లోనూ తాగునీటి అవస్థలు అధికం. ఆయా గ్రామాల్లో నీటి కష్టాలు ఉంటే తెలుసుకుని నీటి ట్యాంకులను పంపుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ప్రాంత ప్రజల దప్పిక తీర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఒకటిన్నర నెలల నుంచి నీటిసమస్య



తమ గ్రామంలో ఒకటిన్నర నెల నుంచి నీటిసమస్య ఉంది. నీటి కోసం సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితుల్లో ఉన్నాం. తమ కష్టాలను పలుమార్లు అధికారుల దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ ఇబ్బందులు ఎన్నాళ్లో తమకు అర్థం కావడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో (ఎండాకాలంలో) పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం నెలకొంది.

– సి.చిన్ననాగయ్య, హరిజనవాడ, దిగువగొట్టివీడు గ్రామం, చిన్నమండెం

నేడు జాతీయ చేతిరాత దినోత్సవం

రాజంపేట : నేడు గురువారం జాతీయ చేతిరాత దినోత్సవమని గ్రాఫాలజిస్ట్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ కాశిగారి ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడం ఒక కళ అన్నారు. చేతిరాత అనేది కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనం మాత్రమే కాదని అది మన భావాలు, మనస్సు స్థితి, వ్యక్తిత్వ లక్షణాలను ప్రతిబింబించే ఒక అద్దమన్నారు. కాశిగారి స్కూల్ ఆఫ్ లైఫ్ స్కిల్స్ పాఠశాల, నూనెవారిపల్లి రాజంపేటలో గురువారం సాయంత్రం 6.15 గంటలకు చేతిరాతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై చేతిరాత విశిష్ట గురించి అవగాహన పొందాలని ఆయన పేర్కొన్నారు.

జాంబవంతుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో జాంబవంతుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో వెలసిన జాంబవంతుడికి బుధవారం పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు చేసి స్వాములవారిని వెండి కవచంతో అలంకరించారు. జాంబవంతుడిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డిజిటల్ నైపుణ్యం పెంపొందించుకోవాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రామాపురం : కంప్యూటర్ ల్యాబ్‌ను ఉపయోగించుకొని డిజిటల్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఐసీఐసీఐ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించిన నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, ఆస్ట్రానమీ ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం కృత్రిమ మేధతో పోటీపడే ప్రపంచంలో ఉన్నామని, డిజిటల్ నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను, ఆస్ట్రానమీ ల్యాబ్‌ను విద్యార్థులు ఉపయోగించుకొని వృద్ధిలోకి రావాలన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏపీ మోడల్ పాఠశాలకు ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాలలో అన్ని వసతులు బాగున్నాయా లేదా అని విద్యార్థులను అడగగా అన్ని వసతులు బాగున్నాయని జవాబు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఐసీఐసీఐ బ్యాంకు రాయచోటి శాఖ మేనేజర్ ఏసుదాసు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలానే రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల పరిష్కార ప్రక్రియపై రెవెన్యూ అధికారులతో వాకబు చేశారు. అర్జీలు అందించిన వారిని క్షేత్రస్థాయిలో కలుసుకుని సమస్యను తెలుసుకున్నారు. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పలు సూచనలు చేశారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా



కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు : అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్ఆర్ సీపీ శ్రేణులను తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న అధికార పార్టీ చర్యలకు ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గాలివీడు ఘటనలో బెయిల్‌పై విడుదలైన కార్యకర్తలు, నాయకుల నివాసాలకు బుధవారం శ్రీకాంత్ రెడ్డి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గాలివీడు ఘటనలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఎటువంటి తప్పు చేయకున్నా గానీ అక్రమ కేసులు బనాయించారన్నారు. రాజకీయ కక్ష సాధింపులతో వారు సంక్రాంతి పండుగ పూట కుటుంబాలకు దూరంగా జైల్లో ఉండడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యుల మనోవేదనను చూసినప్పుడు బాధేసిందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం వచ్చినా తమ కుటుంబ సభ్యుడిలా తోడుగా నిలుస్తామన్నారు. అధికార పార్టీ వేధింపులను సమష్టిగా ఎదుర్కొందామన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని, న్యాయం, ధర్మం ముఖ్యమన్నారు. శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించిన వారిలో గాలివీడుకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు రమణారెడ్డి, ధనంజయ రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, బయారెడ్డి, అరవీడుకు చెందిన అంచలరెడ్డి కుమార్, ఉయ్యాలవాండ్లపల్లె ధర్మారెడ్డి, తూముకుంటకు చెందిన ఆంజనేయులు రెడ్డి, బయారెడ్డి, పాపిరెడ్డిగారిపల్లెలో బయారెడ్డి, గరుగుపల్లె గ్రామంలోని ఇరపటిచేనుపల్లెలో రామాంజులురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ జి.చంద్రారెడ్డి, భానుమూర్తిరెడ్డి, రెడ్డికుమార్‌లను పరామర్శించారు. ఈ కార్యమంలో మాజీ ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, పార్టీ కన్వీనర్ యదుభూషన్ రెడ్డి, ఖాదర్‌మొహిద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, చిన్నపరెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, సర్పంచులు ఉమాపతి రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, ఉమాప్రభాకర్, ఎంపీటీసీ అమానుల్లా, నాయకులు పాల్గొన్నారు.

ఘన నివాళి

పూలుకుంట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పాపిరెడ్డి సతీమణి కృష్ణమ్మ (63) మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలానే తూముకుంట గ్రామం అరుంధతివాడకు చెందిన పార్టీ కార్యకర్త చిన్న ఓబన్నగత కొన్నిరోజుల కిందట మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఎల్ఐసీలో ఖాళీలను భర్తీ చేయాలి



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రాజంపేట టౌన్ : యాజమాన్యం ప్రకటించిన మేరకు ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జీవిత బీమా ఉద్యోగుల సంఘం రాజంపేట శాఖ కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బుధవారం పోస్టుల భర్తీ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడాలంటూ ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అసిస్టెంట్ల పోస్టులు 2700 ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే క్లాస్–4 ఉద్యోగ నియామకాలు చాలాకాలంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లల్లో 5400 మంది ఉద్యోగుల సంఖ్య తగ్గిందన్నారు. రాబోవు రెండు, మూడేళ్లల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో 3, 4 కేడర్లలో వెంటనే నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఎల్ఐసీలో 86 శాతం మంది సిబ్బందికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రాతినిధ్యం వహిస్తుందని, అంతర్జాతీయ కార్మిక సంఘం నిబంధనల మేరకు తమ సంఘానికి గుర్తింపు కోసం సమ్మె చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎల్ఐసీ యాజమాన్యం స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.గంగాధర్, ఐ.లలితమ్మ, వి.రాఘవేంద్ర, ఒ.రాంప్రసాద్, ఎస్ఎం.బాషా, జీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధి పట్టని కూటమి ప్రభుత్వం

రాజంపేట రూరల్ : నేషనల్ హైవే గుంతలమయమై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం దుర్మార్గమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ పూల భాస్కర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో రహదారుల దుస్థితిపై మాట్లాడారు. కడప నుంచి తిరుపతికి వెళ్లే జాతీయ రహదారి అడుగడునా దెబ్బతిని గుంతలమయం అయినప్పటికీ కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా అంటూ మండిపడ్డారు. ఇదే రహదారిలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కూటమి నాయకులు ప్రయాణిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే నేషనల్ హైవే అభివృద్ధికి చర్యలు తీసుకొకుంటే నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

చీడపీడల పర్యవేక్షణ సులభతరం

రామాపురం : నేషనల్ పెస్ట్ సిస్టం మొబైల్ యాప్ ద్వారా చీడపీడల పర్యవేక్షణ చేయవచ్చని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లె గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్ఎస్) యాప్‌తో పంటలలో చీడపీడల పర్యవేక్షణ సులభతరం అవుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



బాలికలకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : బాలికలు ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలని ఎంఈఓ చక్రేనాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలికల పాఠశాలలో కోనంపేట పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలు జరిపారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. బాలికలు ఆరోగ్య సూత్రాలు కచ్చితంగా పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ మణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

రాజంపేట టౌన్ : టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు ప్రతి పాఠ్యాంశానికి సమయం కేటాయించుకొని ప్రణాళికాబద్ధంగా చదివితే అత్యుత్తమ మార్కులు సాధించగలరని ఆంధ్రప్రదేశ్ న్యాయ వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌ధీరజ్ తెలిపారు. మండలంలోని తాళ్లపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థులు ఆయన తన సొంత డబ్బుతో క్వశ్చన్ బ్యాంక్ గైడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ పీసీఎస్.మూర్తి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అనురాధ, లక్ష్మీప్రసన్న, విజయ్‌కుమార్, రామయ్య పాల్గొన్నారు.

సచివాలయాల్లో కనిపించని సిబ్బంది

ప్రజలకు దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



చెన్నముక్కపల్లి సచివాలయం-1లో ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రాయచోటి : ప్రజల వద్దకే పాలన పేరుతో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు నేడు కళావిహీనంగా మారాయి. ప్రతిరోజూ స్థానిక ప్రజలు వివిధ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, పారిశుద్ధ్యం, తాగునీటి వసతులను అనునిత్యం పర్యవేక్షిస్తూ నిండు జనంతో నాడు కళకళలాడిన గ్రామ, వార్డు సచివాలయాలు నేడు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా రాయచోటి రూరల్ మండలంలోని చెన్నముక్కపల్లి సచివాలయమే. బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు సచివాలయంలో ఉద్యోగులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అలానే రైతులకు అందుబాటులో ఉండాల్సిన రైతు భరోసా కేంద్రం నెల రోజులుగా రైతు సేవలకు దూరంగా మూతబడి మూలుగుతోంది. జిల్లా కేంద్రానికి సమీపంలోను, ఆర్డీఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామ సచివాలయాలలో సిబ్బంది విధులకు గైర్హాజరు కావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై స్థానికులు రాయచోటి ఎంపీడీఓ వెంకటేశ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సచివాలయాలను సందర్శించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం–2లో కూడా కంప్యూటర్ ఆపరేటర్ మినహా మిగిలిన సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారు. సిబ్బంది గైర్హాజరు పట్ల ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ స్థానికులకు హామీ ఇచ్చి వెళ్లిపోయినట్లు సమాచారం. దీనిపై వివరణ కోసం ఎంపీడీఓను 'సాక్షి' ఫోన్ ద్వారా ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు.

వైభవంగా శోభాయాత్ర



పెనగలూరు: శోభాయాత్రలో గ్రామస్తులు



రాజంపేట: పట్టణ వీధుల్లో సాగుతున్న శోభాయాత్ర

రాజంపేట టౌన్ : అయోధ్యలో నిర్మించిన రామాలయంలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్టించి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం రాజంపేటలో బీజేపీ, వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు శోభాయాత్ర, బైక్ ర్యాలీని నిర్వహించారు. పట్టణ శివారుల్లోని మన్నూరు వద్ద ఉన్న ఎల్లమ్మ ఆలయం నుంచి వత్తలూరు రోడ్డులో ఉన్న రామాలయం వరకు శోభాయాత్ర ర్యాలీ సాగింది. అలానే ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర పూజలు చేశబూరు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్, ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల కేంద్రంలో బుధవారం రాత్రి శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్టించి ఏడాది కావడంతో గ్రామస్తులు ఈ శోభాయాత్ర నిర్వహించారు. రామాలయం నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు శోభాయాత్రను గ్రామస్తులు జై శ్రీరామ్ అంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటి అర్బన్ : ట్రాఫిక్ చట్టాలు, నియమ, నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి అని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు ట్రాఫిక్స్ రూల్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎస్ఎన్ కాలనీలోని శివాలయం వద్ద నుండి నేతాజీ సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు సాగిన ర్యాలీని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహనను కల్పించుకుని, తప్పక ఆచరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు పాలవుతారంటూ హెచ్చరించారు. వాహనాలను నడిపేటప్పుడు విధిగా సీటు బెల్టును ధరించడంతో పాటు హెల్మెట్‌ను ధరించాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు చోటుచేసుకుంటే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహనను పెంచుకుని కచ్చితంగా పాటించాలంటూ కోరారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బందితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

దారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణకు గురైన దారిని రైతులతో కలసి పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి గ్రామ పరిధిలో అగ్రహారం సమీపంలో దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం సీపీఐ బృందం ఆక్రమణకు గురైన దారిని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు. 172లో గత వంద సంవత్సరాలుగా మినహాయింపు దారిగా ఉన్న స్థలాన్ని భూ కబ్జాదారులు ఆక్రమించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే చెన్నకేశవ స్వామి మాన్యం భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని అటువైపు దాదాపు 150 ఎకరాల పొలం ఉన్న రైతుకు పోవడానికి వీలు లేకపోవడంతో ఉన్న మొత్తం భూమిని సాగు చేయకుండా వదిలేశారని, ఈ దారి సమస్య దాదాపు 2022వ సంవత్సరం నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆఫీసులో నాటి స్పందన కార్యక్రమంలో పదుల సార్లు వినతులు ఇచ్చినా స్పందన కరువైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా దాదాపు నాలుగు, ఐదు వందల మంది రైతుల పొలాలకు అటువైపు వెళ్లే పల్లెలకు దారిని ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి టివి సుదర్శన్, సీపీఐ మండల నాయకులు జగదీష్, ఎం.హరి, రైతులు వీరాంజనేయులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు నట్టల నివారణ మందులు



రాజంపేట రూరల్: పశువులకు నట్టల నివారణ మందులు వేస్తున్న డాక్టర్ భాగ్యవతి



చిన్నమండెం మండలంలో..

చిన్నమండెం : కేశాపురం రెడ్డివారిపల్లి, సద్దలగుట్టపల్లిలో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పాడి పశువులకు నట్టల నివారణ మందులను వైద్యాధికారులు తాపించారు. ఈ సందర్భంగా 123 ఆవులు, 542 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ తాపించినట్లు వైద్యాధికారి తెలిపారు.

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని మందపల్లి, కొల్లావారిపల్లి పశు వైద్య శిబిరాలలో బుధవారం పశువైద్యులు డాక్టర్ కె.భాగ్యవతి ఆధ్వర్యంలో 3736 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. అదే విధంగా ఆమె పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాజేంద్ర, ఆనంద్ బాబు, భాను తదితరులు పాల్గొన్నారు.